క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మిర్యాలగూడ : పట్టణంలోని నందిపాడ్ బైపాస్ వద్ద గంధం మట్టయ్యజానకమ్మల జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలు బయటకు వెళ్లకూడదని, అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లినా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని 30వ వార్డు బంగారుగడ్డ ప్రాంతంలో శనివారం ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్ కో ఏఈ వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీలో సింగిల్ ఫేస్ టు త్రి ఫేస్ నూతనంగా కన్వర్షన్ లైన్ ఏర్పాటు చేయడంలో భాగంగ విద్యుత్ సరఫరా నిలిపిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశం

దేవరకొండ : కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని దేవరకొండ పట్టణంలో శనివారం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి భారీ నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. స్థానిక సాయిశివ గార్డెన్‌లో నిర్వహించనున్న ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్ఐ శివప్రసాద్

పెద్దవూర : గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన దాస హరి గత సెప్టెంబర్ నెలలో తన సెల్‌ఫోన్ పోయింది. దీంతో బాధితుడు సెల్‌ఫోన్ పోయిన విషయాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు పోయిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి శుక్రవారం సాయంత్రం ఎస్ఐ శివప్రసాద్ బాధితుడికి సెల్‌ఫోన్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు.

బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హరి



నల్లగొండ టూటౌన్ : పట్టణానికి చెందిన ఏరుకొండ హరి బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓబీసీలను సంఘటితం చేసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థులను గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, జిలా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పల్లెల్లో పారిశుధ్యం అస్తవ్యస్తం

- డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- వీధుల్లో పారుతున్న మురుగు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



గోనబోయనపల్లిలో డ్రెయినేజీల్లో నిలిచిన మురుగు



బొగ్గులదొనలో చెత్తాచెదారంతో నిండిన మురుగు కాల్వ

డిండి : మండల పరిధిలోని బొగ్గులదొన, గోనబోయనపల్లిలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. ఇళ్ల నుంచి మురుగు నీరు గ్రామ శివారు ప్రాంతాలకు తరలించాడానికి ఏర్పాటు చేసిన డ్రెయినేజీలు కొంతకాలంగా చెత్తాచెదారం నిండడంతో మురుగు నీరు నిల్వగా మారింది. దీంతో ఇళ్ల మధ్యన ఉన్న డ్రెయినేజీ నుంచి దుర్గంధం వెదజల్లడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ రోగాల బారిన పడుతున్నారు.

సమస్యలను పట్టించుకునే వారేరి

గ్రామాల్లో సర్పంచ్‌ల పాలన ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న సమయంలో రోజురోజుకు సమస్యలు పెరుగుతున్నాయి. దీంతో గ్రామాల్లో తిష్ట వేసిన పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారులకు విన్నవించినా పట్టించుకోడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అస్తవ్యవస్తంగా మారిన డ్రెయినేజీల తీరు ఇలాగే కొనసాగితే గ్రామాల్లో విషజ్వరాల బారిన పడక తప్పదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇబ్బందులకు గురవుతున్నాం



బొగ్గులదొనలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గత కొన్ని నెలల నుంచి మురుగునీరు ఇళ్ల మధ్యలనే నిల్వ ఉండటంతో రోగాల బారిన పడుతున్నాం. సంబంధితాధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలి.

\- గుంజ ఇదమ్మ, బొగ్గులదొన

రోగాల బారిన పడుతున్నాం



డ్రెయినేజీల్లో చెత్త, చెదారం పేరుకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి వీధుల్లో పారుతోంది. దీంతో ముక్కుపుటాలు అదిరేలా వాసన వస్తుంది. అలాగే దోమలతో రోగాల బారిన పడుతున్నాం. సమస్యను తీర్చాలని అ ధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లే దు.

\- వెంకటమ్మ, గోనబోయనపల్లి

అక్రమంగా చెట్లు నరికివేస్తే చర్యలు తప్పవు



చెట్లు నరికిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, అటవీ శాఖ అధికారులు

చింతపల్లి : గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా చెట్లు నరికి వేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సర్వే నంబర్ 501 ప్రభుత్వ భూమిలో చెట్లు నరుకుతున్నారన్న సమాచారంతో ఫారెస్ట్, పోలీసు అధికారుల సహకారంతో అక్కడికి చేరుకొని చింతపల్లి గ్రామానికి చెందిన పక్క భూమి రైతులైన కడారి జంగయ్య, కలప వ్యాపారి రమావత్ భాస్కర్‌లు సుమారు 72 చెట్లను నరికి వేసినట్లు తెలిపారు. వేప చెట్లతో పాటు ఇతర చెట్లు కూడా నరికి వేసినట్లు పేర్కొన్నారు. ఇద్దరిపై పోలీస్ స్టేషన్‌లో వాల్టా యాక్ట్ కింద క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట మండల ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ రతన్‌లాల్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉదయ్‌తో పాటు స్థానిక పోలీసులు ఉన్నారు.

తిరునగరు గంగాధర్‌కు నివాళి

మిర్యాలగూడ : స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ సైనికుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరునగరు గంగాధర్ జయంతిని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సాగర్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోశయ్య, మధుసూదన్‌రావు, సలీం, శ్రీనివాస్, ఉదయ్‌భాస్కర్, లింగారెడ్డి, ఎల్లమ్మ, గోపాలకృష్ణ, ఖాదర్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రమ్మకు..

మాడుగులపల్లి : మండలంలోని చిరుమర్తి గ్రామానికి చెందిన నామ చంద్రమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతోపాటు పలువురు మండల నాయకులు చంద్రమ్మ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, దామిడి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి



వెంకట్‌రెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

మాడుగులపల్లి : మండలంలోని చెరువుపల్లి గ్రామానికి చెందిన గడ్డం వెంకట్‌రెడ్డి బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ తరపున జిల్లాలో రైతు సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం రైతులకు వెంటనే బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు యాదవ్, పోతేపాక సాంబయ్య, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండె పోటుతో లైన్‌మన్ మృతి



సోమాచారి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, విజయసింహారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడ లైన్‌మన్‌గా విధులు నిర్వరిస్తున్న కాతోజు సోమాచారి(56) శుక్రవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందారు. తన నివాసంలో ఒక్కసారిగా గుండె నొప్పితో కుప్పకూలిపోగా కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు కూతుళ్లున్నారు. ఆయన నేత్రాలను నేత్ర నిధికి అందిచిన అనంతరం మృతదేహాన్ని ఆయన నివాసంలో సందర్శనార్థం ఉంచారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు ఆయన మరణ వార్త తెలుసుకుని మృతుడి నివాసానికి భారీగా తరలివచ్చారు. సోమాచారి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కన్నీటి పర్యాంతమయ్యారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి సోమాచారి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. వారిలో విద్యుత్ సబ్‌డివిజన్ ఏడీఈలు కోడిరెక్క రవికుమార్, రవీందర్‌రెడ్డి, ఏఈలు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బాలు, అమర్‌సింగ్, తోట వెంకటేశ్వర్లు, బచ్చు సతీష్, సీతారాములు, రాచకొండ వెంకన్న, కృష్ణయ్య, శ్రీరాములు, శ్రీధర్‌రెడ్డి, సైదాచారి, నరేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నరేందర్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు



నరేందర్ మృతదేహంపై పూలమాల వేస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

పెద్దవూర : కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ తుడుం నరేందర్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తుడుం నరేందర్ రేబీస్ వ్యాధితో గురువారం రాత్రి మృతి చెందాడు. శుక్రవారం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిలతో కలిసి బసిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లి నరేందర్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, మాజీ సర్పంచ్ నరాల కొండయ్య, నాయకులు నడ్డి ఆంజనేయులు, కోట అంజి, ముత్యాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఊరె వెంకన్న, కిలారి మురళి, సతీష్, హన్మంతరెడ్డి, నాగరాజు, వెంకటయ్య, కిషన్, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగయ్య సేవలు మరువలేనివి



నాగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సుధాకర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : పేద ప్రజల కోసం వేముల నాగయ్య చేసిన సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నాగయ్య 8వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కనగల్ మండల కేంద్రంలో యువజన నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన నాగయ్య మరణించే వరకు పేదల కోసం పోరాటాలు నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వీరారెడ్డి, పాలడుగు నాగార్జున, చినపాక లక్ష్మీనారాయణ, పాముసగుండ్ల అచ్చాలు, గంజి మురళీధర్, దండెంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, వెంకన్న, రవీందర్, సైదాచారి, మారయ్య, నగేష్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి



రామగిరి(నల్లగొండ) : కొనుగోళ్లను పరిశీలిస్తున్న పీడీ నాగిరెడ్డి

రామగిరి(నల్లగొండ) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ పీడీ నాగిరెడ్డి అన్నారు. గురువారం తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తూకం వేసిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట ఏపీఎం శ్రీదేవి పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండా పార్టీనే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండా పార్టీనేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో నిర్వహించిన భిక్షానాయక్ 45వ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా భిక్షానాయక్ స్తూపం వద్ద పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించి వారందరూ గుడిసెలు వేసుకుని జీవించే విధంగా అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అప్పట్లో చింతపల్లి శివారులో పేదల గుడిసెలు తీసేస్తున్నారని సమాచారం అందడంతో దానిని అడ్డుకునేందుకు అక్కడకు వెళ్లిన భిక్షానాయక్‌ను భూస్వామ్య గుండాలు దారుణంగా హత్య చేశారని చెప్పారు. ఆయన ఆశయ సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు జగదీశ్‌చంద్ర, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, మూడావత్ రవినాయక్, మంగారెడ్డి, పరశురాములు, రామ్మూర్తి, గోవర్ధని, గాదె పద్మ, మల్లయ్య, అంబాలి, సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన



అడవిదేవులపల్లి : కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ కరుణాకర్‌రావు



డిండి : పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ డ్యానియల్

అడవిదేవులపల్లి : మండలంలోని చిట్యాల, బాల్నేపల్లి, అడవిదేవులపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీఓ కరుణాకర్‌రావు పరిశీలించారు. అనంరతం కూలీలను వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు కూలీలలకు ఎండ తీవ్రత నుంచి బయటపడేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మండలంలోని చిట్యాల, అడవిదేవులపల్లి గ్రామాల్లో దగ్గరుండి పందిర్లు వేయించిన క్లస్టర్ ఎంపీఓను ప్రత్యేకంగా అభినందించారు. నేటి నుంచి అన్ని గ్రామాల్లో పనిప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ సూరానాయక్, టీఏ రాధలతోపాటు పీఎస్, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

డిండి : మండల పరిధిలోని ఎర్రారం గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం జరిగిన ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ డ్యానియల్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు కల్పించే పనులు, పని ప్రదేశం వద్ద ఏర్పాటు చేసే సౌకర్యాల గురించి ఆయన ఏపీఓ జయరాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎండ తక్కువగా ఉన్న సమయంలోనే ఉపాధి పని చేయాలని ఆయన కూలీలకు సూచించారు. వారి వెంట ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్య ఉన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బైరెడ్డి పిచ్చిరెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పిచ్చిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, ఎంపీటీసీ కలమ్మవెంకన్న, పొట్ల వెంకటేశ్వర్లు, మలిగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఒంటెద్దు రవీంద్రరెడ్డి, నాయకులు కొండెబోయిన శ్రీను, గజ్జల సత్యనారాయణరెడ్డి, మాతంగి రవి, యాదగిరి, నగేష్, శ్రీరాములు, రమణ, హనుమంతరావు, నరసింహారావు, గోపి, హరికుమార్ పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

దేవరకొండ : బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని వివిధ ప్రజాల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని అంబేడ్కర్ గ్రంథాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే, బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణపై ఆలిండియా సమతా సైనిక్ దళ్, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని జయంతి ఉత్సవాలను నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాజారావు, వెంకన్న, భిక్షపతి, సురేష్, గోపాల్, శ్రీనివాస్‌గౌడ్, భాస్కరాచారి, చంద్రమౌళి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మిర్యాలగూడ అర్బన్ : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ పి.నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం రావులపెంట గ్రామ శివారులోని మూసీ వాగునుంచి ఇసుకను అక్రమంగా ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని డ్రైవర్లు, వాటి యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

- పాత నేరస్తులపై నిఘా, గతంలోనే బైండోవర్లు
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు

దేవరకొండ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు.త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే పోలీస్ అధికారులు దేవరకొండ సబ్‌డివిజన్ పరిధిలో గల సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడంతో పాటు గతంలోని పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఎన్నికల సందర్భంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేయకూడదన్న ఆలోచనతో పోలీసు శాఖ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటుంది. ముందస్తుగా వారిపై ఓ కన్నేసి వారి కార్యకలాపాలపై దృష్టి సారించింది. ఇప్పటికే దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలో పాత నేరస్తులతో పాటు రౌడీషీట్ నమోదైన వారికి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి గత సాధారణ ఎన్నికల సమయంలోనే బైండోవర్లు సైతం చేశారు. సబ్ డివిజన్ పరిధిలో సాధారణ ఎన్నికల సమయంలో దాదాపు 300మందికి పైగా పాత నేరస్తులు, రౌడీషీట్ ఉన్న వారిని పోలీసు అధికారులు గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు దేవరకొండ డీఎస్పీ గిరిబాబు పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

నిరంతరం నిఘా..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పాత నేరస్తులు, గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిని పోలీసు శాఖ ఇప్పటికే బైండోవర్ చేసింది. స్థానిక తహసీల్దార్ల ఎదుట వారిని బైండోవర్ చేసి సొంత పూచీకత్తుపై వదిలేశారు. బైండోవర్ అయిన అనంతరం నేరాలకు పాల్పడితే వారికి రూ.లక్ష జరిమానా విధించడంతో పాటు కేసు నమోదు చేయనున్నారు. రౌడీషీట్ ఉన్న వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేసి వారు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాం. అలాంటి ప్రాంతాల్లో పారా మిలటరీ బలగాలు విధులు నిర్వహిస్తాయి. గత ఎన్నికల సమయంలోనే రౌడీషీట్ ఉన్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించి బైండోవర్ చేశాం. త్వరలో జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదు. ఎన్నికల సంఘం నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి.

\- గిరిబాబు, డీఎస్పీ, దేవరకొండ

వైభవంగా నృసింహుని నిత్యకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. కల్యాణ తంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుఫర్కపూజ, మాంగల్యధారణను తలంబ్రాల మహోత్సవంతో వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ముమ్మరంగా ఏర్పాట్లు





రెండో భద్రాద్రిగా పేరు పొందిన నల్లగొండ పట్టణంలోని రామగిరి శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 15నుంచి 21వరకు నిర్వహించే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో చలువ పందిళ్లు, ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాలు, రథాన్ని సిద్ధం చేస్తున్నారు.

